
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
5
బుధవారం 6 నవంబరు 2024








భక్తిశ్రద్ధలతో నాగులపంచమి

నాగులచవితి సందర్భంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. సిద్దిపేటలోని గాడిచెర్లపల్లిలోని కోటి పడగల సంతాన నాగదేవత ఆలయంలో భక్తులు పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు కంకణాల దశరథం స్వామి పర్యవేక్షణలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి నాగదేవతను వేడుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని నాగుల ప్రతిమలకు మహిళలు పసుపు, కుంకుమ, పాలతో అభిషేకం చేశారు.

- సిద్దిపేట కల్చరల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి)

సర్వేకు సర్వం సిద్ధం

- కులగణనకు 2,302 ఎన్యూమరేటర్లు, 230 సూపర్‌వైజర్లు
- జిల్లాలో 3.45 లక్షల కుటుంబాలు
- సర్వే అనంతరం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు



సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సర్వేకు నియామకమైన అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులను ఈ నెల 4న మండల, పట్టణస్థాయిలో పూర్తి చేశారు. ఈనెల 6 నుంచి సర్వే సిబ్బంది ఇంటింటికి తిరిగి మొదటి రెండు మూడు రోజులు ఇళ్ల జాబితాను సిద్ధం చేసి స్టిక్కర్ వేస్తారు. ఆ తర్వాత 75 అంశాలతో కూడిన సర్వే నిర్వహిస్తారు. ప్రజల జీవన ప్రమాణాలు మార్చేందుకు సర్వే ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల కలెక్టర్ మను చౌదరి అధికారులతో సర్వేకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సర్వే ఆధారంగా భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందని వివరించారు. ఎన్యూమరేటర్లకు అవసరమైన సమాచారం అందిస్తేచాలని సూచించారు.

మొదటి దశలో ఇలా..

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేషన్ బ్లాక్‌గా నిర్దేశించారు. ఎన్యూమరేటర్లు మొదటి దశలో ఇళ్ల జాబితా రూపొందిస్తారు. చిరునామా, కుటుంబ యజమాని పేరు వివరాలు సేకరించి ప్రతి ఇంటికీ స్టిక్కర్ అతికిస్తారు. తర్వాత మళ్లీ సమాచారంతో సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేస్తారు. ఇంటి యజమాని అందుబాటులో లేకపోతే మళ్లీ అవకాశం కల్పిస్తారు. వలస వెళ్లిన వారి వివరాలు వారి బంధువులు తెలిపినా నమోదు చేసుకుంటారు. జిల్లాలో 3.45 లక్షల కుటుంబాలున్నాయి. నూతనంగా కాలనీలు, వార్డులు ఏర్పడిన దృష్ట్యా కుటుంబాల సంఖ్య పెరిగే ఆస్కారం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

సర్వే కోసం జిల్లాలో 2302 మందిని ఎన్యూమరేటర్లను నియమించారు. 10 బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్ చొప్పున 230 మందిని నియమించారు. వారిని ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. ఎన్యూమరేటర్లుగా ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, వివిధ శాఖలకు సిబ్బందిని నియమించారు. మధ్యాహ్నం తర్వాత సర్వే విధులు నిర్వహించేలా పాఠశాలల ఉపాధ్యాయులకు వెసులుబాటు కల్పించారు. పూర్తిస్థాయి సర్వే అనంతరం సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

న్యూస్ బాక్స్



లభ్యమైన ఓటర్ ఐడీ కార్డులు

ఓటర్ ఐడీ కార్డులు రోడ్డుపాలు

- ఓ వీఆర్‌ఏ ఐడీకార్డూ లభ్యం
- రెవెన్యూ అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

అక్కన్నపేట, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు భద్రంగా అందించాల్సిన ఓటరు ఐడీ కార్డులను గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డుపక్కన చెత్తలో పడేశారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని 18 ఏళ్లు పైబడిన వారికి అందించాల్సిన దాదాపు వందకు పైగా ఓటరు ఐడీ కార్డులను అక్కన్నపేట నుంచి బోదరుగుండా వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన ఉన్న కుంటలో ఓ బ్యాగ్‌తో సహా పడివేశారు. స్థానికులు ఆ బ్యాగ్‌ను గుర్తించి తహసీల్దార్ అనంతరెడ్డికి అందజేశారు. అయితే, ఓటరు ఐడీ కార్డులతో పాటు స్థానిక వీఆర్‌ఏగా విధులు నిర్వహించిన పిడిశెట్టి శ్రీకాంత్ ఐడీకార్డు కూడా ఉండడం గమనార్హం. ఇలా ఓటరు ఐడీ కార్డులను పడేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనంతరెడ్డి హామీ ఇచ్చారు.

పట్టభద్రులకు పట్టదా!

ఉపాధ్యాయులూ వెనుకబాటే - నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

- నత్తనడకన ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ
- గడువు పెంచుతారని ఆశ
- విస్తృతంగా ప్రచారం చేసిన పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల ఆశావహులు

ఓటర్ల నమోదు వివరాలు (మంగళవారం వరకు)

జిల్లా	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
సంగారెడ్డి	20,619	2342
సిద్దిపేట	23,504	2781
మెదక్	9528	892



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, నవంబరు 5 : మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చిలో జరగనున్నాయి. ఒక స్థానంలో గ్రాడ్యుయేట్లు, మరో స్థానంలో ఉపాధ్యాయులు ఓట్లు వేయాల్సి ఉంటుంది. అయితే ఆరేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఎన్నికలకు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. గతంలో ఓటు వేసినవారు కూడా ప్రస్తుతం ఓటరుగా తమ పేరును ఎన్‌రోల్‌మెంట్ చేయించాల్సిందే. సెప్టెంబరు 30న ప్రారంభమైన ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు 6తో అంటే నేటితో ముగియనున్నది. ఓటర్ల నమోదు గురించి అటు పట్టభద్రుల స్థానం ఆశావహులు.. ఇటు ఉపాధ్యాయ సీటు ఆశావహులు విస్తృతంగా ప్రచారం చేశారు. అయినప్పటికీ ఓట్ల నమోదు నత్తనడకన కొనసాగుతూ వచ్చింది.

2019 మార్చిలో జరిగిన మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానంలో 1,96,321 మంది తమ ఓటు హక్కు పొందారు. కాగా ప్రస్తుత ఎన్నిక కోసం 2,56,673 మంది ఇప్పటి వరకు తమ పేరిట దరఖాస్తులు సమర్పించారు. గతంతో పోల్చితే 60వేల మంది పెరిగినప్పటికీ ఇది చాలా తక్కువ అని అధికారులు భావిస్తున్నారు. ఇక నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో దాదాపు 30వేల మంది ఉపాధ్యాయులు ఉంటారు. కానీ ఇప్పటివరకు 18,623 మంది మాత్రమే ఓటు కోసం దరఖాస్తు పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో 2 లక్షలపైనే గ్రాడ్యుయేట్లు..

సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 2లక్షలపైనే డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులు ఉంటారని అంచనా. కానీ ఇప్పటివరకు కేవలం 55వేల మంది మాత్రమే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేశారు. 25శాతం వంతుకే పరిమితమయ్యారు. ఈరోజు అవకాశం ఉన్నందున మరో 10వేల దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన 65వేలకు మించి దరఖాస్తులు వచ్చే పరిస్థితి లేదని అర్థమవుతోంది. ఇప్పటికే

మిగతా 7వ పేజీలో...

బాలిక కిడ్నాప్ కలకలం

- ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

దౌల్తాబాద్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చిన్నారికి చాక్లెట్ ఆశచూపి కిడ్నాప్‌కు యత్నించిన సంఘటన దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం చోటుచేసుకుంది. ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాపూర్‌లోని బుడగ జంగాలకు చెందిన రాములు కూతురు పల్లవి నాలుగో తరగతి చదువుతోంది. చిన్నారి ఈనెల 3న ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని పాఠశాల వైపు ఆడుకోవడానికి వెళ్తుంది. గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారికి చాక్లెట్ ఆశచూపి దగ్గరకు పిలిచారు. చాక్లెట్‌ను తింటున్న బాలిక నోరు మూసి ఓ వ్యాన్‌లోకి ఎక్కించారు. ఆ తర్వాత మత్తు ఇంజక్షన్ ఇచ్చారు. మత్తు పనిచేయకపోవడంతో చిన్నారి కేకలు వేసింది. స్థానికులు గమనించి వాహనాన్ని వెంబడించగా కిడ్నాపర్లు గ్రామశివారులోని పత్తిచేను వద్ద బాలికను వదిలి పారారయ్యారు. బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన జరిగి మూడు రోజులు దాటినా కూడా విషయాన్ని మీడియాకు చెప్పకుండా, దుండగులను పట్టుకోకపోవడంపై గ్రామస్థులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చేర్యాల మండలం నాగపురిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సూచనలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొనుగోళ్లలో జాప్యం వద్దు

- కలెక్టర్ మనుచౌదరి

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం నాగపురి, పెద్దరాజుపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సాయంత్రం సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ఆయా కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వహించకూడదని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కాగా నాగపురితో పాటు సమీప గ్రామాల్లో సన్నరకం ధాన్యం అధికంగా పండిస్తామని, సన్నవడ్ల కొనుగోలు కేంద్రం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ మనుచౌదరి స్పందించి త్వరితగతిన సన్నవడ్ల కొనుగోలుకేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ అజయ్‌దేవ్ ఆర్య, ఏపీడీ మదుసూధన్, ఐకేపీ ఏసీఎం ప్రకాశం తదితరులున్నారు.

మినీ స్టేడియం ఏర్పాటుపై నీలినీడలు

- పెద్దమ్మగడ్డ శివారులో ఆరెకరాల స్థలం ప్రతిపాదన
- కలెక్టర్‌కు నివేదిక అందించినా స్థల మార్పిడిలో జాప్యం

8



ప్రతిపాదిత స్థలం

వాతావరణానికి అనుగుణంగా పంటలను మార్చాలి

- కేవీకేల అధిపతి షేక్ ఎస్. మీరా



7

స్కూల్ ఆటో బోల్తా

- 13 మంది విద్యార్థులకు గాయాలు
- దుబ్బాక మండలం పెద్దచీకోడ్ శివారులో ఘటన

7





చలి షురూ..

- పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- అత్యల్పంగా కొండపాకలో 15.1 డిగ్రీలు

శీతాకాలం ప్రారంభంలోనే ఉమ్మడి మెదక్ జిల్లాపై క్రమంగా చలి పంజా విసురుతున్నది. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాయంత్రం ఐదు గంటలకే చలి మొదలవుతుండగా.. ఉదయం ఎనిమిది దాటినా తగ్గడం లేదు. దీనికి తోడు మంచు కురుస్తుండడంతో చలి తీవ్రత పెరుగుతున్నది. మంగళవారం అత్యల్పంగా సిద్దిపేట జిల్లా కొండపాకలో 15.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గౌరారం 15.6, బేగంపేట 15.7, హబ్షీపూర్ 15.8, అలాగే సంగారెడ్డి జిల్లా నల్లవెల్లిలో 15.7, మెదక్‌జిల్లా డీధర్మారంలో 15.8 డిగ్రీలు నమోదైంది.

- మెదక్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)

అమీన్‌పూర్‌లో హైడ్రా సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్‌లో హైడ్రా అధికారులు సర్వే చేపట్టారు. పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు అందడంతో హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ ఆదేశాలతో మంగళవారం సర్వే చేశారు. ఎకరాకు పైగా ఉన్న పార్కుస్థలంతో పాటు, రహదారులను గోల్డెన్ కీ వెంచర్ వాళ్లు కబ్జా చేశారంటూ వెంకటరమణ కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఇరు పక్షాలు కోర్టును ఆశ్రయించడంతో హై కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేయించారు. మొత్తం 5 సర్వే నంబర్లలో 150 ఎకరాలకు పైగా పరిశీలించారు.

విద్యార్థులు సకాలంలో పరీక్ష ఫీజులు చెల్లించాలి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యార్థులు సకాలంలో తమ పరీక్ష ఫీజు చెల్లించాలని డీఐఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 26 వరకు గడువు ఉన్నదని పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్ ఆర్ట్స్, సైన్స్, సెకండ్ ఇయర్ ఆర్ట్స్ గ్రూపుల విద్యార్థులు రూ.520, సెకండ్ ఇయర్ సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు రూ.750 చెల్లించాల్సి ఉంటుదన్నారు. రూ.100 ఫైన్‌తో డిసెంబరు 4 వరకు, రూ.500 ఫైన్‌తో డిసెంబరు 11 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో డిసెంబరు 18 వరకు, రూ.2 వేల అపరాధ రుసుము డిసెంబరు 27 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉన్నట్లు డీఐఈవో తెలిపారు.

రైతులు చిరుధాన్యాల సాగు పెంచాలి

- వాతావరణానికి అనుగుణంగా పంటలను మార్చాలి
- దక్షిణ భారతదేశ కేవీకేల అధిపతి షేక్ ఎస్. మీరా



స్వచ్ఛందసంస్థల సభ్యులతో దక్షిణ భారతదేశం కేవీకేల అధిపతి షేక్ ఎస్. మీరా

జహీరాబాద్, నవంబరు 5: వాతావరణానికి అనుగుణంగా రైతులు పంటలను మార్చాలని ఐసీఏఆర్-అటారీ డైరెక్టర్, దక్షిణభారతదేశం కేవీకేల అధిపతి షేక్ ఎస్ మీరా పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని దిడిగి శివారులోగల డీడీఎస్-కేవీకే (డెక్కన్ డెవలప్‌మెంట్-కృషి విజ్ఞానకేంద్రం)లో చిరుధాన్యాల చెల్లెళ్ల జాతీయస్థాయి 4వ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో నాగాలాండ్, గుజరాత్, ఒడిషా, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని చిరుధాన్యాలను సాగుచేసే 17 స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో షేక్ ఎస్. మీరా మాట్లాడుతూ అంతరించిన చిరుధాన్యాలకు జీవం పోసిన డీడీఎస్ రైతుల పనితీరును అభినందించారు. దేశంలో చిరుధాన్యాల వినియోగం పెరిగినప్పటికీ అందుకు అనుగుణంగా ఉత్పత్తులను పెంచాలన్నారు. చిరుధాన్యాలను సాగుచేసే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిరంతరం సాగు చేయాలన్నారు. ప్రస్తుతం 11.08మిలియన్ టన్నుల చిరుధాన్యాల ఉత్పత్తి ఉండగా, దీనిని 20 మిలియన్‌టన్నుల మేర ఉత్పత్తి చేసేందుకు చిరుధాన్యాల చెల్లెళ్లు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగు, వినియోగం కొత్తతరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిరుధాన్యాల సాగుకు సంబంధించి అఖిల భారతస్థాయిలో చిరుధాన్యాల చెల్లెళ్ల సమాఖ్యను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. చిరుధాన్యాలను సాగును పెంచేందుకు ప్రభుత్వాలు తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాల్లో ఆహారభద్రత, పోషక భద్రత ఉన్నాయన్నారు. నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వాతి తివారీ మాట్లాడారు. సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కోనింటి మాణిక్‌రావు, డీడీఎస్ ఈడీ దివ్య, డీడీఎస్ డైరెక్టర్లు రుక్మిణీరావు, రామాంజనేయులు, డీడీఎస్‌జాయింట్ డైరెక్టర్ గిరిధర్, మహిళారైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

చిరుధాన్యాల చెల్లెళ్ల జాతీయస్థాయి 4వ సదస్సు సందర్భంగా నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మొత్తం 53 రకాల విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బుధవారమూ జరిగే ఈ సదస్సులో మిల్లెట్ సాగులో విజయం సాధించిన మహిళా రైతుల పరిచయ కార్యక్రమం ఉంటుంది. ఆహుతులు ఆయా రాష్ట్రాల మహిళారైతుల పండించిన చిరుధాన్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

గుట్టలపై కందకాలు తవ్వించి జలసంరక్షణ



హిమాచల్‌ప్రదేశ్‌లో చెప్పుకోదగ్గ పంటలు పండవు. కొండలు, అటవీప్రాంతం ఎక్కువగా ఉంటుంది. బీళ్లుగా ఉన్న గుట్టలపై కందకాలు తవ్వించి జలసంరక్షణ చర్యలు చేపట్టి వర్షాధారిత పంటలను పండిస్తున్నం. గావ్‌కా జంగల్, గావ్‌కా హాత్‌మే అనే నినాదంతో పని చేస్తున్నాం. దశాబ్దాల క్రితం నిర్మాణ్ అనే ఎన్‌జీవో సంస్థను ఏర్పాటు చేసి దేశంలో మిల్లెట్ నెట్‌వర్క్ సిస్టమ్‌తో కలిసి పని చేశాం. 65 మహిళా సంఘాలతో గ్రూపులను ఏర్పాటు చేశాం. శాస్త్రవేత్తల సలహాతో వర్మీకం పోస్టు తయారు చేశాం. చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం గతేడాది పద్మశ్రీ అవార్డులో సత్కరించింది.

- పద్మశ్రీఅవార్డు గ్రహీత నేకరాం శర్మ

యువతిపై దాడి చేసిన నిందితుడి అరెస్ట్

మెదక్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద యువతిపై కత్తితో దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ మంగళవారం వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన దనసిరి చైతన్య బెంగళూరులో ఉంటున్నాడు. 2022లో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవుసులపల్లి గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయం చేసుకొని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. యువతి నిరాకరించడంతోపాటు దూరంగా ఉంచడంతో కక్ష పెంచుకొని సోమవారం ఆమె పరీక్ష రాసేందుకు రాగా, వాగ్వాదానికి దిగి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద సెల్‌ఫోన్, రక్తపు మరకలు అంటిన షర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు డీఎస్పీ తెలిపారు.

బొద్దింకలు పడ్డ కల్లు తాగి పదిమందికి అస్వస్థత

ఒకరి పరిస్థితి విషమం.. ఆస్పత్రికి తరలింపు

రామాయంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాలలో మంగళవారం బొద్దింకలు పడ్డ కల్లు తాగి పది మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని కల్లు దుకాణంలో పలువుర మంగళవారం కల్లు తాగారు. అందులో సుమారు పది మంది వాంతులు చేసుకున్నారు. అస్వస్థతకు గురైన వారిని గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కల్లు సీసాల్లో చూడగా, బొద్దింకలు కనిపించాయి. కల్లు దుకాణం నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే సీసాల్లో బొద్దింకలు వచ్చాయని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

స్కూల్ ఆటో బోల్తా...

13 మంది విద్యార్థులకు గాయాలు

దుబ్బాక, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూల్ విద్యార్థులను తీసుకుని వస్తున్న ఆటో బోల్తాపడి 13 మంది విద్యార్థులకు గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మంగళవారం జరిగింది. వివరాలు ఉన్నాయి. దుబ్బాకలోని గాయత్రీ వివేకానంద విద్యాలయానికి కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన 13 మంది విద్యార్థులు మంగళవారం ఓ ప్రైవేట్ ఆటోలో పాఠశాలకు వస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో పెద్దచీకోడ్ గ్రామ శివారులో అదుపు తప్పి.. చెట్టుకు బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న 13 మంది విద్యార్థులకూ గాయాలయ్యాయి. స్థానికులు బోల్తా పడిన ఆటోలో నుంచి విద్యార్థులను బయటికి తీశారు. వెంటనే వారిని 108 వాహనంలో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంత మందిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

బైక్‌ను ఢీ కొన్న ఆటో.. ఒకరు మృతి

జగదేవ్‌పూర్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను టాటా ఏసీ వాహనం ఢీ కొన్న ఘటనలో ఒకరు మృత్యువాత పడ్డారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొంతం అశోక్‌కుమార్(48) ఫర్టిలైజర్ కొనుగోలు చేసేందుకు జగదేవ్‌పూర్ వెళ్లాడు. అక్కడి ఓ పెట్రోల్ పంపులో ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోసుకోవడానికి వెళ్తుండగా ప్రజ్ఞాపూర్ వైపు నుంచి వస్తున్న టాటా ఏసీ వాహనం బలంగా ఢీ కొట్టింది. దీంతో అశోక్ కుమార్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. జగదేవ్‌పూర్ ఎస్సై చంద్ర మోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

కంది, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పనులు చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం కంది మండలంలోని బ్యాతోల్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మణ్ (20)ది రేకుల షెడ్డులాంటి ఇల్లు. ఆ ఇంటికి కరెంట్ కనెక్షన్ కోసం వినియోగించిన సర్వీస్ వైర్ నాసిరకంగా ఉండి.. అక్కడడక్కడ పగుళ్లు వచ్చింది. దీంతో కరెంట్ రేకులషెడ్డులో నుంచి సపోర్ట్ పైప్‌లకు ప్రవహించింది. లక్ష్మణ్ అనుకోకుండా ఇంటి ముందర ఉన్న పైపును పట్టుకోవడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు.



వ్యవసాయ అధికారితో మాట్లాడుతున్న రైతులు

తేమతో తంటా..

బోర్డుపై 17 శాతం.. తూకం 15 శాతం ఉంటేనే..

కొర్రీలు పెడుతున్న అధికారులు

కొడిపల్లి, నవంబరు (ఆంధ్రజ్యోతి) 5: ధాన్యం కొనుగోలు విషయంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పెడుతున్న కొర్రీలతో రైతులు దిక్కుతోచకున్నారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డుపై తేమ 17 శాతం వరకు ఉంటే సరిపోతుందని ఉండగా, అధికారులు మాత్రం 15 వరకు తేమ ఉంటేనే తూకం వేస్తామని తెలపడంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. కొడిపల్లి మండలం ధర్మసాగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం 15 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేయాలని అధికారులు చెప్పారు. దీంతో సుమారు 50 మంది రైతులు బోర్డుపై 17 శాతం ఉంటే సరిపోతుందని ఉండగా, ఇదేమిటని అధికారులను ప్రశ్నించారు. ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకుండా.. ఇప్పుడు కొర్రీలు పెట్టడం ఎంత వరకు సమంజసం అని రైతులు యాదవరెడ్డి, వీరయ్య, కిష్టయ్య, శాగ లచ్చయ్య, దుర్గయ్య, నవీన్, శ్రీను, మల్లయ్య, ఎల్లయ్య, వడ్డె రాములు తదితరులు ప్రశ్నించారు. వ్యవసాయ విస్తరణ అధికారి సాహితీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు రాగా, ఇదే విషయాన్ని రైతులు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తున్నామని, తామేం చేయలేమని ఆమె చేతులెత్తేశారు.

టీచర్లంతా ఓటుహక్కు పొందాలి

పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి



సిద్దిపేట, నవంబరు 5, ఆంధ్రజ్యోతి: మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన సిద్దిపేట నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో పర్యటించారు. నేటితో ఓటర్ల నమోదు గడువు ముగుస్తున్నందున అప్రమత్తం కావాలని సూచించారు. తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే టీచర్ల హక్కులతోపాటు పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయులంతా ఎక్కడికక్కడ ఓటర్ల నమోదు ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

పట్టభద్రులకు పట్టదా!

5వ పేజీ తరువాయి..

పట్టభద్రుల స్థానంలో బరిలో నిలవనున్న ఆశావహులంతా పోటాపోటీగా ప్రచారం చేశారు. ఒకరిద్దరైతే ప్రతీ జిల్లా కేంద్రంలో ఓటరు ఎన్‌రోల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. మార్నింగ్ వాక్‌లో, పాఠశాలల్లో, కంపెనీలలో, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అవగాహన చేపట్టారు. అయినప్పటికీ చాలా మంది పట్టభద్రులు ఈ ఎన్నికపై ఆసక్తి చూపడం లేదు.

మందకొడిగా ఉపాధ్యాయులూ..

ప్రభుత్వ ఉన్నత, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా, గురుకులం, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఇతర ప్రభుత్వ సంబంధిత విద్యాసంస్థల్లో మూడేళ్లపైగా బోధనానుభవం ఉన్నవారంతా టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో ఓటేయడానికి అర్హులు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఇలాంటి వారి సంఖ్య దాదాపు 9వేలకు పైనే ఉంటుందని అంచనా. ఇప్పటివరకు 6వేల మంది మాత్రమే దరఖాస్తులు సమర్పించారు. ఇంకా సుమారు 3వేల మంది దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో ఉపాధ్యాయుల ఓట్లపై పూర్తిగా అవగాహన కొరవడింది. అధికారులు, విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై అంతంతమాత్రంగానే ప్రచారం నిర్వహించారు. ఇక పీఆర్‌టీయూ సంఘం తరఫున అధికారిక అభ్యర్థిగా నిలిచిన వంగ మహేందర్‌రెడ్డి మాత్రమే యాక్టీవ్‌గా ఓటర్ల నమోదులో పాల్గొంటున్నారు. మరే ఇతర ఆశావహులు, అభ్యర్థులు తెరమీద కానరావడం లేదు.

ఒక్కరోజే గడువు..

ప్రతిష్ఠాత్మకమైన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందాలంటే ఫారం-18ను పూరించాలి. తమ వివరాలతో పాటు ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, డిగ్రీ సమానాంతర అర్హత జీరాక్స్ పత్రాలను సమర్పించాలి. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అదే విధంగా అన్ని జిల్లా కేంద్రాలు, డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాల్లోనూ ఆఫ్‌లైన్‌లోనూ సమర్పించవచ్చు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లే కీలకం కానున్నాయి. బరిలో ఉండే అభ్యర్థులంతా పట్టభద్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితులుంటాయి. ఇక ఫారం-19 ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే వీలుంది. తమ హక్కులు, పాఠశాలల అభివృద్ధి గురించి చట్టసభల్లో గళం వినిపించే ఎమ్మెల్సీని ఎన్నుకునే అవకాశం ఉపాధ్యాయులకు ఉంది. కాగా గడువు కూడా పెంచే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

ఇద్దరు గంజాయి విక్రేతలకు జైలు

ఒక్కొక్కరికీ ఐదేళ్లు..



జిన్నారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించిన కేసులో ఇద్దరు నిందితులకు డిస్ట్రిక్ సెసెన్స్ కోర్టు జయంతి వేర్వేరుగా ఐదు సంవత్సరాల జైలు, రూ. 25వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ వెల్లడించారు. మంగళవారం కేసు వివరాలు ఆయన వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022 జూన్ 14న ఇద్దరు గంజాయి విక్రయిస్తున్నారని ఒకరు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. తులారం పేడా, ప్రేమ్ మేహర్ అనే వ్యక్తులు తాము అద్దెకు ఉంటున్న ఇంట్లో సూట్‌కేసులో ఆరు కేజీల గంజాయిని దాచి ఉంచారు. దానిని స్వాధీనం చేసుకుని, పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నేరం నిర్ధారణ కావడంతో ఇద్దరు నిందితులకు వేర్వేరుగా ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 25వేల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. కేసును పరిశోధించిన బొల్లారం పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ షురూ

సంగారెడ్డి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలుర 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పది ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఈవో వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, హోప్ న్యూరో అండ్ కార్డియాక్ ఆస్పత్రి ఎండీ. డా.కృష్ణమూర్తి, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ, డీవైఎస్‌వో ఖాసీంబేగ్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావీద్‌అలీ, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజీఅనంతకిషన్, సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్

కొండాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సీ.హెచ్. కోనాపూర్‌లో రెండో రోజు ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగింది. స్థానిక ఎంఏ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో నిజామాబాద్, నల్లగొండ జట్లు



విజయం సాధించిన కరీంనగర్ జిల్లా జట్టు

విజయం సాధించినట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

చేగుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు బాల, బాలికలను ఎంపిక చేసినట్లు కోచ్ కరణం గణేష్‌రవికుమార్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రమేష్, పీఈటీల సంఘం అధ్యక్షుడు నాగరాజు, సెలక్షన్ కమిటీ ఇన్‌చార్జి శారద తెలిపారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగంలో ఎంపికలకు 350 మంది హాజరు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

కాగా, ఇందులో 36 మంది బాలికలు, 36 మంది బాలురను ఎంపిక చేశామని, మేడ్చల్‌లో ఈనెల 10 నుంచి 12 వరకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని వివరించారు.

8 నుంచి హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక

హుస్నాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలను హుస్నాబాద్‌లోని మిని స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ రావుల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం 14 సంవత్సరాల బాలబాలికలకు జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

మల్లన్న ఆలయంలో సర్పసూక్త పారాయణం

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. నాగచవితి పర్వదినం సందర్భంగా ఆలయ ముఖమండపంలోని ఉత్సవ మూర్తులకు పూజలు చేసి సర్పసూక్త పారాయణం, మన్యసూక్త పారాయణం చేశారు. అనంతరం దీపోత్సవం జరపగా, మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని భక్తిప్రపత్తులతో జ్యోతులు వెలిగించి తన్మయత్వం చెందారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో ఆకాశదీపం ఆవిష్కరిస్తున్న అర్చకులు

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజలు జరిపిన అనంతరం సంప్రదాయబద్ధంగా ఆకాశ దీపాన్ని ఆవిష్కరించారు. మహిళలు జ్యోతులు వెలిగించి వేణుగోపాలస్వామిని వేడుకున్నారు.

'అక్రమ లే అవుట్‌పై చర్యలు తీసుకోవాలి'

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం రసూలాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా చేపట్టిన లే-అవుట్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన లే అవుట్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. శివారులోని కుంటకాలువకు చేరువన లే-అవుట్‌కు నీటిపారుదలశాఖాధికారులు అనుమతిలివ్వడం తగదన్నారు.

7న చెకుముఖి టాలెంట్ టెస్ట్: ఎంఈవో

మిరుదొడ్డి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7న అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామని అక్బర్‌పేట-భూంపల్లి విద్యాధికారి అంజయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని పోతరెడ్డిపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చెకుముఖి మండల కన్వీనర్ సుకన్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు సాదత్‌అలీ ఆధ్వర్యంలో చెకుముఖి టాలెండ్ టెస్ట్ పత్రికను ఆవిష్కరించారు.

మలేషియాలో జరిగే దశాబ్ది వేడుకులకు అందె భాస్కర్

మిరుదొడ్డి: తెలంగాణ దశాబ్ది అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని మలేషియాలోని తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో 8, 9, 10లో మలేషియాలో జరిగే డప్పు ప్రదర్శనకు మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన అండగి భాస్కర్‌కు ఆహ్వానం అందింది. మారుమూల ప్రాంతం నుంచి మలేషియాలో జరిగే డప్పు కార్యక్రమంలో పాల్గొననుండడంపై హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

గజ్వేల్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని మాజీ ఎంపీటీసీ జ్యోతిస్వామి అన్నారు. గజ్వేల్ మండలం కొల్లూరు గ్రామానికి చెందిన నీరుడి హంసవ్వకు రూ.13,500 సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును ఆమె అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ గొల్ల స్వామి, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ నరేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రైతునేస్తంపై వీడియో కాన్ఫరెన్స్

కోహెడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోహెడ రైతువేదికలో రైతునేస్తంలో భాగంగా రైతులు, ఫర్టిలైజర్‌షాప్ యజమానులు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు సూచనలు చేశారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

తొగుట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం కాన్గల్ గ్రామానికి చెందిన రైతు దోమల కొమురయ్యకు చెందిన కాడెద్దు మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని తెలిపారు. బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని గ్రామస్థులు కోరారు.



వ్యవసాయ బావులకు వెళ్లే దారిలో ఆడుకుంటున్న యువకులు

మినీ స్టేడియం ఏర్పాటుపై నీలినీడలు

- మూడేళ్ల క్రితం స్థల సేకరణకు హరీశ్‌రావు చొరవ
- పెద్దమ్మగడ్డ శివారులో ఆరెకరాల స్థలం ప్రతిపాదన
- కలెక్టర్‌కు నివేదిక అందించినా స్థల మార్పిడిలో జాప్యం

చేర్యాల, నవంబరు 5: మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారుల పుట్టినిల్లు అయిన చేర్యాలలో మినీ స్టేడియం ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. స్టేడియం మంజూరై ఏళ్లు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో అతీగతీ లేకుండాపోయింది. మూడేళ్ల క్రితం మాజీమంత్రి హరీశ్‌రావు చేర్యాలలో నిర్వహించిన అభివృద్ధి పనుల సమీక్షలో స్టేడియం ఏర్పాటుకు స్థల సేకరణ చేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అప్పటి అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌ను ఆదేశించారు. దీంతో పెద్దమ్మగడ్డ శివారులోని నువ్వులకుంట సర్వే నెం.110లో సుమారు 7 ఎకరాల స్థలం ఉండగా, కొన్నినెలల క్రితం ఎకరం స్థలాన్ని డంపింగ్‌యార్డు, వైకుంఠధామానికి కేటాయించారు. మిగతా ఆరు ఎకరాల స్థలాన్ని స్టేడియం కోసం ప్రతిపాదించారు. కానీ రికార్డుల్లో కుంట స్థలంగా నమోదవడం పట్ల మార్పిడి కోసం కలెక్టర్‌కు నివేదిక అందించారు. పట్టణంలో ప్రభుత్వ స్థలం లేకపోవడం, నువ్వులకుంట ఆధారంగా పంటలెవరూ సాగుచేయకపోవడం పట్ల స్థలాన్ని మార్పిడి చేయాలని విజ్ఞప్తి చేశారు. కానీ నేటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఆట మరుగునపడుతుంది.

వన్నె తెచ్చిన క్రీడాకారులు

ఉమ్మడి చేర్యాల మండలం పోసాన్‌పల్లి గ్రామానికి చెందిన నళిని హ్యాండ్‌బాల్‌లో రాణించి అర్జున అవార్డు పొందిన తొలి మహిళా క్రీడాకారిణిగా పేరొందింది. హ్యాండ్‌బాల్ అంతర్జాతీయ క్రీడాకారుడిగా కందుకూరి శంభులింగం చేర్యాలకు వన్నె తీసుకువచ్చాడు. అంతేకాకుండా అతడి సోదరుడు కందుకూరి ఉపేందర్ జాతీయస్థాయి క్రీడాకారుడిగా పేరొందాడు. ఆకునూరుకు చెందిన జక్కుల నవనీత హ్యాండ్‌బాల్ పోటీల్లో అంతర్జాతీయస్థాయికి ఎదిగింది. అదే గ్రామానికి చెందిన జక్కుల నవనీతతో పాటు మరికొంతమంది విద్యార్థినులు హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణిస్తూ చేర్యాల ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నారు. గత కాంగ్రెస్ హయాంలో వరంగల్ జిల్లాలో కొనసాగిన సమయంలో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య మినీ స్టేడియాన్ని మంజూరీ చేయించారు. చేర్యాలలోని ముస్త్యాల గ్రామశివారులో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినా స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరీ చేయకపోవడంతో అటకెక్కింది.

క్రీడాకారులకు కానరాని ప్రోత్సాహం

అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడాకారులను అందించినా క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టకపోవడంతో పలువురు ఉసూరుమంటున్నారు. క్రీడల్లో రాణించేందుకు అవసరమైన శిక్షణ, సాధనకు యోగ్యమైన స్థలం కరువవడంతో గల్లీలు, పొలాల్లో ఆటలాడుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారం, భవన నిర్మాణాల వల్ల కూడా ఖాళీ స్థలాలు కనుమరుగయ్యాయని పలువురు పేర్కొంటున్నారు.

అనువైన స్థలం లేక..



మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులున్నా సాధన చేసేందుకు అనువైన క్రీడా మైదానం అందుబాటులో లేకపోవడంతో క్రీడల్లో రాణించలేకపోతున్నారు. రానురాను చాలామందికి క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుంది. మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపించాలి.

- ఎండీ.రఫత్, హ్యాండ్‌బాల్ కోచ్

చేయూతనందిస్తే మరింతగా రాణిస్తారు



చేర్యాలకు చెందిన ఎంతో మంది పోటీల్లో రాణిస్తున్నారు. క్రీడా మైదానంలో సాధన చేస్తే నైపుణ్యం పెంపొందుతుంది. చేయూతనందిస్తే మరింతగా రాణించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం స్పందించి మినీ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- కందుకూరి ఉపేందర్, హ్యాండ్‌బాల్ నేషనల్ ప్లేయర్

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి



మినీ స్టేడియం విషయంలో ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందించాం. నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. గతంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చొరవ వహించడంతో మినీ స్టేడియంపై ఆశలు రేకెత్తాయి. కానీ అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టించుకోకపోవడంతో గ్రహణం పట్టింది. ప్రభుత్వం క్రీడాస్ఫూర్తిని చాటి స్టేడియం ఏర్పాటుచేసి ప్రోత్సహించాలి.

- కోణం నర్సింహులు, స్పోర్ట్స్‌క్లబ్ ప్రతినిధి



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్

పంట దిగుబడిలో భూసార పరీక్షలు కీలకం

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక



చిన్నకోడూరు: రాముని పట్లలో భూసార పరీక్ష నమూనా సేకరణను పరిశీలిస్తున్న డీఏవో రాధిక

చిన్నకోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంట దిగుబడిలో భూసార పరీక్ష ముఖ్యపాత్ర పోషిస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక అన్నారు. మంగళవారం మండలంలోని రామునిపట్ల గ్రామంలో భూసార పరీక్ష నమూనా సేకరణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నమూనా ఏవిధంగా సేకరించాలో రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. భూసార పరీక్ష ద్వారా నేలలో లభ్యమయ్యే పోషకాల గురించి తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈవోలు నిర్మల, శివ, ప్రశాంత్, అశోక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్మగ్రహ దీక్ష



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తపస్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు ధర్మగ్రహ దీక్షలో భాగంగా తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పీఆర్సీ వెంటనే అమలుచేసి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగ నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

'సర్వే డ్యూటీతో ప్రాథమిక విద్య కుంటుపడుతుంది'

చిన్నకోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ సమగ్ర సర్వే కోసం కేవలం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు డ్యూటీ వేయడం వల్ల ప్రాథమిక విద్య కుంటుపడుతుందని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి అన్నారు. చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల పాఠశాలలో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే కోసం ప్రాథమిక పాఠశాలలను మధ్యాహ్నం మూసివేయడం తగదన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయులందరికీ సర్వే డ్యూటీ వేయాలన్నారు. దివ్యాంగ, అనారోగ్య సమస్యలతో బాధపడుతూన్న ఉపాధ్యాయులకు సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి శివాజీ పాల్గొన్నారు.

తేమ పేరుతో రైతులకు ఇబ్బందులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తేమ పేరుతో పత్తి రైతులను సీసీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్) జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లను పరిశీలించి మాట్లాడారు. రైతులు అష్టకష్టాలు పడి పత్తిని సాగుచేస్తే అమ్మకాలకు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తేమ శాతం పేరిట సీసీఐ అధికారులు పత్తిని తిరస్కరిస్తున్నారని, దీనిని ఆసరాగా తీసుకుని మిల్లర్లు గిట్టుబాటు ధర కంటే రూ. 2 వేలు తక్కువకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

సర్పంచుల బిల్లుల జాప్యం గత ప్రభుత్వ వైఫల్యమే: కాంగ్రెస్

నంగునూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సర్పంచులు చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం గత ప్రభుత్వ వైఫల్యమేనని టీపీసీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. మంగళవారం నంగునూరులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తప్పెట శంకర్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టిన నాయకులే నేడు ధర్నాలకు మాజీ సర్పంచులను ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడుతున్న తరుణంలో బీఆర్ఎస్ నేతలు, మాజీ సర్పంచులను రెచ్చగొట్టి ధర్నాలకు ప్రోత్సహించడం సిగ్గుచేటు అన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నకోడూరు/చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు అన్నారు. మండలంలోని చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం గంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. చేర్యాల మండలం దానంపల్లి, దొమ్మాట, గురజకుంట, కడవేరుగు తదితర గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కొమ్ము రవి, నర్సింహులు పాల్గొన్నారు. చేర్యాల మండలం కమలాయపల్లి, అర్జునపట్ల తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో సందర్శించి మాట్లాడారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

బెజ్జంకి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేట మణికంఠ కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు

కుకునూరుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించదు.. ఐకేపీ కొనుగోలు చేయదు' అని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం లకుడారం, కుకునూరుపల్లి, మంగోల్ గ్రామాల్లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను పలు పార్టీలకు చెందిన నాయకులు, పీఏసీఎస్ అధికారులు ప్రారంభించారు. అంతేకాకుండా మూడు కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కూడా అలాట్ చేశారు.



చిన్నకోడూరు: చెర్లఅంకిరెడ్డిపల్లిలో ధాన్యాన్ని తూకం వేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మౌనిక



మౌనికను అభినందిస్తున్న నాగపురి జడ్పీఎస్ఎస్ హెచ్ఎం అయిలయ్య, ఉపాధ్యాయులు

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కె.మౌనిక రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-17 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ద్వితీయ బహుమతి కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెచ్ఎం ఎలికట్టె అయిలయ్య, ఉపాధ్యాయులు మౌనికను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థులు



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జగదేవ్‌పూర్ మండలం తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు వంక వెన్నెల, బీడ స్రవంతి, పావని, సౌమ్య ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, పీడీ రాజిరెడ్డి తెలిపారు. వారంరోజులుగా సంగారెడ్డిలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే స్టాండ్ బైలో శివాని, వంక పూజ, అనూషలు ఎంపికయ్యారని తెలిపారు. 8 నుంచి ఖమ్మం జిల్లా కల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

చేర్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ పథకానికి పలువరు భక్తులు మంగళవారం విరాళం అందించారు. ఈ సందర్భంగా సిద్దిపేటకు చెందిన చింతల చంద్రహాస్ శాశ్వత నిత్యాన్నదాన మహారాజపోషకత్వానికి రూ.1,00,116, నిత్యాన్నదాతకు రూ.10,116, శాశ్వత కల్యాణానికి రూ.5,016, శాశ్వత పూజదాతకు రూ.1,116 విరాళంగా అందించారు. అలాగే ఆలయ ఆధ్వర్యంలో చేపట్టనున్న 100 గదుల సత్రభవన సముదాయంలో 2 గదుల నిర్మాణానికి విరాళం అందించనున్నట్లు వాగ్దానం చేశారు. ఈ మేరకు ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, మహదేవుని మనోహర్‌లు స్వామివారి ప్రసాదం అందించారు.

అంబేడ్కర్ సంఘం బలోపేతం కోసం కమిటీలు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్



అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణవ్యాప్తంగా అంబేడ్కర్ సంఘాలను పటిష్ఠం చేసేందుకు నూతన కమిటీలను నియమిస్తున్నట్లు అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో జరిగిన సమావేశంలో అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన మ్యాక రమేష్‌ను సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. రమేష్ ఎంపీటీసీగా అంబేడ్కర్ సంఘం అభివృద్ధికి, దళిత బహుజన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పోతరాజు లాలయ్య ఆదేశాల మేరకు రమేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తొందూరి ఎల్లయ్య, కండె సుధాకర్, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బెజ్జంకి బాబు, మాజీ ఎంపీపీ తాడూరి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ కులగణన విప్లవాత్మకం

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఓబీసీ కులగణనను చేపట్టడం విప్లవాత్మకమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. గజ్వేల్ నుంచి ఆయన కులగణన సమీక్షకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, మేధావులు, సామాజికవేత్తలు, ప్రజాసంఘాలతో జరిపిన చర్చల్లో ఆయన పాల్గొన్నట్లు తెలిపారు. ఆయనవెంట డీబీఎఫ్ నాయకులు దుబాషి శంకర్, బీసీ సంఘాల నాయకుడు రాచకొండ వెంకటేశ్, న్యాయవాది పొన్నం దేవరాజ్‌గౌడ్, సామాజిక కార్యకర్తలు జాన్, శివలింగం ఉన్నారు.

'మహాధర్నాను విజయవంతం చేయండి'

సిద్దిపేట రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులు తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ కోరారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో కార్మికులతో కలిసి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులుగా రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సెలవు దినం లేకుండా పనిచేస్తున్నారన్నారు. మల్టీపర్పస్ విధానం వచ్చాక సిబ్బందిని ఇబ్బందుల పాలు చేస్తున్నారని మండిపడ్డారు. 40 ఏళ్లుగా పాలకులు మారుతున్నా కార్మికుల తలరాతలు మారడం లేదన్నారు. ఈనెల 12న పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయం ములుగులో ముట్టడి చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీకాంత్, బాలు, కార్మికులు శంకర్, మల్లయ్య పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

- ఎంబీబీఎస్ చదివేందుకు ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా రూ.7 లక్షల రుణం మంజూరు



రుణ పత్రాన్ని అందజేస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌లుశెట్టి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో చదివేవారికి పేదరికం అడ్డుకాదని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ చల్ల శ్రీనివాస్‌లుశెట్టి తెలిపారు. మంగళవారం హుస్నాబాద్ మండలం బల్లునాయక్‌తండాకు చెందిన గిరిజన విద్యార్థిని లావుడ్య దేవి ఆన్‌లైన్ క్లాస్‌లు విని ఎంబీబీఎస్ సీటు సాధించింది. ప్రైవేట్ కళాశాలలో సీటు రావడంతో ఆర్థిక సమస్య అడ్డంకిగా మారింది. విషయం తెలుసుకున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ బ్యాంకు ద్వారా రూ.7 లక్షలు రుణాన్ని మంజూరు చేశారు. రుణ పత్రాన్ని విద్యార్థి దేవికి మంగళవారం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాటం


- జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

కొండపాక/మద్దూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్మిక, కర్షక సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కొండపాక మండలం దుద్దెడలో పార్టీ మండల మూడో మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఎర్ర జెండాతోనే ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్ముల బాల నరసయ్య, మాడోజు కనకచారి, నాగరాజు, సీపీఎం మండల కమిటీ సభ్యులు తాటోజు రవీంద్రచారి, జగపతి నాగరాజు, ప్రభాకర్, నర్ర ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో నిర్వహించిన సీపీఎం మహాసభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సీపీఐ సిద్ధం'

జగదేవ్‌పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఐ సిద్ధంగా ఉన్నదని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలో తిగుల్ గ్రామంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నర్సింహారెడ్డి, గ్రామ కార్యదర్శి బిక్షపతి, సభ్యులు పాల్గొన్నారు.

'కులగణన సర్వేను విజయవంతం చేయాలి'



విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

నంగునూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ జి.సరిత అన్నారు. మంగళవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు నవంబరు 6, 7న కుటుంబాల వివరాలు సేకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌వో సంతోష్, ఆర్ఐలు లింగం, జయసూర్య పాల్గొన్నారు. అనంతరం నంగునూరు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లింగం, ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామిగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టూటౌన్ సీఐకి అభినందన

సిద్దిపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని లాల్ కమాన్ దగ్గర గతనెలలో ఓ బంగారం దుకాణంలో జరిగిన చోరీ అంతర్రాష్ట్ర దొంగను కేవలం 48 గంటల్లోపు పట్టుకుని రిమాండ్‌కు పంపిన సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్‌ను తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా సాయిరాం క్రికెట్ అసోసియేషన్ తరఫున సన్మానం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసీఏ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చెందిరెడ్డి నరేందర్‌రెడ్డి, సభ్యులు మహేశ్, నవీన్, విజయ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.